## క్లుప్తంగా

### పారిశుధ్య పనుల పరిశీలన

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని ఆయా కాలనీల్లో చేపట్టిన పారిశుధ్య పనులను కమిషనర్ మంతాయారు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీల్లో పారిశుధ్య పనులను వేగంగా చేపడుతున్నామన్నారు. పారిశుధ్యంకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు.

### నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

న్యాల్‌కల్(జహీరాబాద్): నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయశాఖ మండల అధికారి లావణ్య అన్నారు. స్థానిక రైతు వేదికలో ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల విక్రయించే డీలర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలన్నారు. విక్రయించే ఎరువులు, విత్తనాలకు సంబంధించి రైతులకు రశీదులు తప్పకుండా ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా దుకాణాల్లో స్టాక్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఏఈఓలు, వివిధ గ్రామాలకు చెందిన డీలర్లు పాల్గొన్నారు.

### ఆయిల్ పామ్ సాగుపై అవగాహన



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

నారాయణఖేడ్: మనూరు మండల పరిధిలోని ఆయా గ్రామాల రైతులకు శుక్రవారం ఆయిల్ పామ్ సాగుపై మనూరు రైతువేదికలో గోద్రేజ్ అగ్రోవెట్, వ్యవసాయశాఖ తరపున అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఈవో సంగమేశ్వర్, గొద్రేజ్ ఏరియా మేనేజర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పామ్ ఆయిల్ పంటకు మంచి డిమాండ్ ఉందన్నారు. రైతులకు డ్రిప్‌నకు ప్రభుత్వం 90శాతం సబ్సిడీ అందజేస్తోందని తెలిపారు. ఒక్క మొక్క రూ.20 చొప్పున రైతులు చెల్లించినచో మొక్కలు సరఫరా చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ఏఈవో, గోద్రేజ్ ఫీల్డ్ ఆఫీసర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు ప్రవీణ్, సాయికిరణ్‌రెడ్డి, మహేష్, ఫీల్డ్ ఆఫీసర్ అజయ్ పాల్గొన్నారు.

### కొనుగోలు కేంద్రాల తనిఖీ



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ అశోక్ చక్రవర్తి

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట మండల పరిధిలోని రాంరెడ్డిపేట, సిర్గాపూర్ మండల పరిధిలోని కడ్పల్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను నారాయణఖేడ్ ఆర్డీఓ అశోక చక్రవర్తి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజగణేష్, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

### రైతులు ఆందోళన చెందవద్దు



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్

జిన్నారం(పటాన్‌చెరు): కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే ధాన్యం తప్పకుండా కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని తహశీల్దార్ భిక్షపతి అన్నారు. జిన్నారంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలులో రైతులు ఎలాంటి అపోహలకు గురికావద్దని సూచించారు.

### విల్లా పనుల అడ్డగింత

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని సర్వే నంబర్ 75లో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్నా విల్లాల పనులను శుక్రవారం టౌన్ ప్లానింగ్ అధికారులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ అధికారులు సత్యనారాయణ, పవన్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా?

- గుంతలమయంగా రహదారులు
- నత్తనడకన మిషన్ భగీరథ పనులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



గుంతలమయంగా బొల్లారం ప్రధాన రహదారి

**బొల్లారం మున్సిపాలిటీకి ప్రతి ఏటా కోట్ల రూపాయల ఆదాయం వస్తోంది. ప్రతి ఏటా ఆదాయం అభివృద్ధికి ఖర్చు చేస్తున్నామని లెక్కలు చెబుతున్నారనే తప్ప చేపట్టిన అభివృద్ధి మాత్రం శూన్యం. ఏళ్ల కాలం నుంచి రోడ్లు గుంతలమయంగా ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.**

– జిన్నారం(పటాన్‌చెరు)

బొల్లారం మున్సిపల్ పరిధిలో సుమారు 50వేల జనాభా ఉంటుంది. అన్ని రాష్ట్రాల ప్రజలు ఇక్కడ నివాసం ఉంటూ సమీప పరిశ్రమల్లో పనిచేసుకుంటూ జీవనాన్ని సాగిస్తుంటారు. మున్సిపల్‌గా బొల్లారం ఆవిర్భవించిన నాటి నుంచి నేటి వరకు రోడ్లు పూర్తిగా అధ్వానంగా మారాయి. ఈ విషయాన్ని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు.,

**మూడేళ్లు గడుస్తున్నా పూర్తికాని పనులు**

రోడ్లు నిర్మించేందుకు నిధులు కేటాయిస్తున్నామని అధికారులు చెబుతున్న ప్రయోజనం లేకుండాపోయింది. మిషన్ భగీరథ పనులు పూర్తి అయిన తర్వాత రోడ్లు వేయిస్తామని అధికారులు చెబుతున్నారు. మిషన్ భగీరథ పనులు మూడేళ్ల నుంచి నత్తనడకన సాగుతున్నాయి. దీంతో రోడ్ల పనులు ముందుకు సాగడంలేదు. వారం రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారాయి. బొల్లారంలోని ప్రధాన రోడ్లు అధ్వాన్నంగా మారడంతో వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రధాన రహదారులను త్వరగా పూర్తి చేయించేవిధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



వర్షం నీటితో నిండిన గుంత

**ఇబ్బందులు తప్పడం లేదు**



బొల్లారంలోని ప్రధాన రోడ్లతో పాటు వీధుల్లోని రోడ్లు కూడా అద్వాన్నంగా మారాయి. ఏళ్ల కాలం నుంచి ఈ సమస్య ఉన్నా అధికారులు, పాలకులు పట్టించుకోవటంలేదు. మిషన్ భగీరథ పైప్‌లైన్ నిర్మాణ పనులకు రహదారుల నిర్మాణ పనులకు ముడిపెడుతుండటంతో పనులు కొనసాగడంలేదు. అధికారులు స్పందించి మిషన్ భగీరథ పనులను పూర్తి చేసేవిధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలి.

– తిరుపతిరెడ్డి, బొల్లారం

## హైదరాబాద్‌కు సీవోఈ తరలింపు!

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ మండలంలోని బూచినెల్లి గ్రామ పరిధిలోని మైనార్టీ బాలికల గురుకుల కళాశాల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీవోఈ)ను హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు తెలిసింది. మైనార్టీ విద్యార్థులకు ఇంటర్ విద్యతో పాటు నీట్ జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో శిక్షణ ఇచ్చేందుకు బూచినెల్లి గురుకుల కళాశాలలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీవోఈ)ను ఏర్పాటు చేశారు. ఫ్యాకల్టీ అందుబాటులో లేరని షాహీన్ విద్యాసంస్థల అధ్యాపకులు విద్యార్థులకు నీట్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఇలా ఉండగా తల్లిదండ్రుల ఫిర్యాదులు, ఫ్యాకల్టీ కొరత కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సీవోఈలను ప్రభుత్వం కుదిస్తుందని తెలిసింది. ఇందులో భాగంగా జహీరాబాద్ మండలంలోని బూచినెల్లి సీవోఈని కూడా హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిసింది. జహీరాబాద్ నుంచి సీవోఈని హైదరాబాద్‌కు తరలించడాన్ని తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై గురుకుల ప్రిన్సిపాల్ రేచల్ దృష్టికి తీసుకెళ్లగా జహీరాబాద్ సీవోఈని తరలింపునకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు.



బాలికల మైనార్టీ గురుకుల కళాశాల

## ఘనంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని వెంకటాపూర్ శివారులో ఉన్న వెంకటాచల దివ్యక్షేత్రంలో శుక్రవారం పద్మావతి గోదా సమేత స్వయంభు అద్భుత వేంకటేశ్వరస్వామి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారికి అభిషేకం, అంకురారోహణం నిర్వహించారు. అనంతరం గ్రామంలోని హనుమాన్ ఆలయం నుంచి మహిళలు స్వామివారి ఆలయం వరకు కలశాలల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



కలశాలల ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

## సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్ప తెలిపారు. డివిజన్ పరిధిలోని జ్యోతినగర్ కాలనీలో శుక్రవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు కాలనీవాసులు ఇళ్ల ముందు నీరు నిలుస్తున్నాయని, అశోక్‌నగర్, జ్యోతినగర్ మధ్యలో ఉన్న నాలాలో నీరు వెళ్లకుండా ఇళ్ల ముందు చెత్తాచెదారం పేరుకుపోతోందని కార్పొరేటర్‌కు వివరించగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. బాక్స్‌డ్రైన్ నిర్మాణం కోసం నిధులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పాలిసెట్ ప్రవేశ పరీక్ష

జహీరాబాద్ టౌన్: పాలిసెట్–2024 ఎంట్రెన్స్ పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. మూడేళ్ల ఇంజనీరింగ్, నాన్ ఇన్‌జనీరింగ్ డిప్లొమా, వెటర్నరీ డిప్లొమా ప్రవేశాలకు జహీరాబాద్‌లోని రంజోల్ పాలిటెక్నిక్, ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు ఆర్ఎల్ఆర్ స్కూల్ మూడు కేంద్రాల్లో ఎంట్రన్స్ పరీక్షలు నిర్వహించారు. 797 మంది విద్యార్థులకు 708 మంది మాత్రమే పరీక్షలు రాశారు. 89 మంది పరీక్షలకు హాజరు కాలేదని కోఆర్డినేటర్ కుమారస్వామి పేర్కొన్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



శ్రీశైలం మృతదేహం

జిన్నారం(పటాన్‌చెరు): గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన గుమ్మడిదల మండల పరిధిలోని నల్లవల్లి ప్రధాన రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన శ్రీశైలం గుమ్మడిదల వైపు నుంచి నర్సాపూర్ వైపు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టగా శ్రీశైలం అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

### అందుబాటులో జనుము విత్తనాలు

రాయికోడ్(అందోల్): మండల పరిధిలోని మహబత్‌పూర్ గ్రామంలోని ఆగ్రోస్ రైతుసేవా కేంద్రంలో జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి అభినాష్‌వర్మ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విత్తనాలు అవసరమున్న రైతులు పట్టాపాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలను వెంట తెచ్చుకోవాలని సూచించారు. 40 కిలోల జనుము విత్తనాల బ్యాగు ధర రూ.1,448 ఉంటుందని పేర్కొన్నారు.

### నేటి నుంచి అవగాహన సమావేశాలు

రాయికోడ్(అందోల్): మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో శనివారం నుంచి రైతులకు అవగాహన సమావేశాలు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి అభినాష్‌వర్మ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెలాఖరు వరకు నిర్వహించే సమావేశాల్లో ముఖ్యంగా రైతులు విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తామన్నారు. రైతులు తప్పనిసరిగా సమావేశాలకు హాజరు కావాలని సూచించారు.

### నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి

మునిపల్లి(అందోల్): నమ్మకమున్న ఫర్టిలైజర్ షాపులో నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని మండల వ్యవసాయాధికారి శివకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. త్వరలోనే మండలంలోని ఆయా గ్రామాల్లో అధికారులతో కలిసి వివిధ రకాల విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు.

### జీలుగ విత్తనాల పంపిణీ

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట మండల పరిధిలోని బాచేపల్లి గ్రామంలో రైతులకు శుక్రవారం జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ శశాంక్, పీఏసీఎస్ సీఈఓ విఠల్ రెడ్డి, ఏఈఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### కొనుగోలు కేంద్రం పునఃప్రారంభం

రాయికోడ్(అందోల్): మండల కేంద్రం రాయికోడ్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రం పునఃప్రారంభం కానున్నట్లు మండల వ్యవసాయ అధికారి అభినాష్‌వర్మ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా జిల్లా యంత్రాంగానికి రైతుల వద్ద జొన్నలు నిల్వ ఉన్న అంశాన్ని వివరించామన్నారు. రెండు రోజుల్లో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని పునఃప్రారంభిస్తామన్నారు.

### 27న నిధి ఆప్కే నికట్

పటాన్‌చెరు టౌన్: భవిష్యనిధి సంస్థ ద్వారా సమస్యల పరిష్కారానికి ఫిర్యాదులో భాగంగా ఈ నెల 27న నిధి ఆప్కే నికట్ 2.0 నిర్వహించనున్నట్లు ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ విశాల్‌అగర్వాల్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు కేంద్రాల్లో ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5:45 గంటల వరకు శిబిరాలు నిర్వహిస్తామన్నారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ, సంగారెడ్డి ఎక్స్ రోడ్ బాలాజీ హాస్పిటల్స్, హత్నూర మండల పరిధిలోని ముచెర్ల ఎస్‌సీఎల్ ప్రైవేట్ లిమిటెడ్‌లలో భవిష్యనిధికి సమస్యలు ఉన్న వారు పైన పేర్కొన్న మూడు కేంద్రాల్లో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

## కొనుగోలును వేగవంతం చేయండి

- ఆర్డీఓ రాజు



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ, అధికారులు

ఝరాసంగం(జహీరాబాద్): ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని జహీరాబాద్ ఆర్డీఓ రాజు అన్నారు. ఝరాసంగం మండల కేంద్రంలోని జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యంను వెంటనే తరలించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్, సొసైటీ చైర్మన్ నిసార్ అహ్మద్, రెవెన్యూ అధికారి రామారావు పాల్గొన్నారు.

## పార్కు స్థలం కబ్జాకు యత్నం

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని మల్లంపేటకు ఆనుకొని ఉన్న పార్కు స్థలాన్ని కబ్జా చేసేందుకు కొంతమంది అక్రమార్కులు వారం రోజుల నుంచి యత్నిస్తున్నారు. ఈ విషయాన్ని స్థానికులు బొల్లారం మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం టౌన్ ప్లానింగ్ అధికారి పవన్ ఆధ్వర్యంలో పార్కు స్థలం చుట్టూ గుంతను తీయించి ఈ స్థలంలోకి ఎవరూ రాకుండా హద్దులు వేయించారు. అనంతరం పవన్ మాట్లాడుతూ ఇండస్ట్రీయల్ పార్కు స్థలాన్ని ఎవరైనా కబ్జా చేసేందుకు యత్నిస్తే చట్టపరంగా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



పార్కు స్థలం చుట్టూ గుంత తీయిస్తున్న అధికారులు

## ఎమ్మెల్యే దంపతులకు ఆహ్వానం

నారాయణఖేడ్: సంగారెడ్డి మండల పరిధిలోని ఫసల్‌వాదీలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో వచ్చే నెల 12వ తేదీ నుంచి 16 వరకు నిర్వహించనున్న నవాయతన రామశిలాయ యాత్ర మహోత్సవాలకు సంబంధించిన ఆహ్వానపత్రికను విద్యాపీఠం నిర్వాహకులు మహేశ్వరశర్మ సిద్ధాంతి శుక్రవారం ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, అనుపమారెడ్డి దంపతులకు అందజేశారు. అనంతరం మనూరు మండల పరిధిలోని పుల్‌కుర్తిలో నిర్వహిస్తున్న అఖండ హరినామ సప్తాహ కార్యక్రమంలో ఉన్న అంతర్‌గామ ఆశ్రమ పీఠాధిపతి కరణ్ గజేంద్ర భారతి మహారాజ్‌ను కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్వరశర్మ సిద్ధాంతి మాట్లాడుతూ ఫసల్‌వాదీలో 239 ప్రత్యేకతలతో మహామేరు నిర్మాణం చేస్తున్నామన్నారు. శిలాశాస్త్రంలోనే అరుదైనరీతిలో ఒకేశిలలో 10 విగ్రహాలు అత్యంత సౌందర్యవంతంగా వాస్తు ఆగమ శాస్త్రానుసారంగా విద్యాపీఠం తరలించబోతోందన్నారు. అందులో భాగంగానే మహోత్సవాలను నిర్వహించనున్నట్లు వివరించారు.



ఎమ్మెల్యే సంజీవరెడ్డి దంపతులకు ఆహ్వానపత్రికను అందజేస్తున్న మహేశ్వరశర్మ

## విద్యాహక్కు చట్టం అమలు చేయండి



ఎంఈఓ కూర్మికి వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యాహక్కు చట్టం అమలు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్‌కుమార్, డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎంఈఓ కార్యాలయంలో మండల విద్యాధికారి అంజయ్య అందుబాటులో లేకపోవడంతో ఆయన కూర్మికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం.. ప్రైవేట్ విద్యా సంస్థల్లో 25 శాతం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచితంగా అవకాశం కల్పించాలన్నారు, ఎంఈఓ వెంటనే స్పందించి ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యాహక్కు చట్టం అమలయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎంఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8గంటల నుంచి 9గంటల వరకు విద్యుత్‌నగర్, పాత ఎంఐజీకాలనీ, మ్యాన్‌సొసైటీ కాలనీ, తెల్లాపూర్, అంబేద్కర్ కాలనీ, జేపీ కాలనీ, ఇంద్రానగర్, మైఫెయిర్ రోడ్డు ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

**రామచంద్రాపురంలో..**

రామచంద్రాపురం సబ్‌స్టేషన్ అమీన్‌పూర్ ఫీడర్ పరిధిలో చెట్లకొమ్మలు తొలగింపు కారణంగా శనివారం మల్లికార్జున్‌నగర్, జయలక్ష్మీనగర్ ఫేస్1, ఫేస్2, ఫేస్3, ఫేస్4 కాలనీలలో ఉదయం 11గంటల నుంచి 12.30గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

**నేడు జోగిపేటలో విద్యుత్ సరఫరా నిలిపివేత**

జోగిపేట(అందోల్): పట్టణంలో శనివారం 6 గంటల పాటు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అందోలు టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఏఈ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని విద్యుత్ లైన్ల కింద చెట్లు పెరగడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతున్నందునా చెట్లను తొలగించేందుకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

## డీఎస్పీని కలిసిన ఎల్ఐసీ మేనేజర్

జహీరాబాద్ టౌన్: ఎల్ఐసీ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు డీఎస్‌పీ రాంమోహన్‌రెడ్డిని జహీరాబాద్ బ్రాంచి మేనేజర్ శ్రీనివాస్‌రాజు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ మేనేజర్ గతేడాది సాధించిన విజయాలు, ఎల్ఐసీ ఆధ్వర్యంలో చేపట్టిన సేవా కార్యక్రమాలతో పాటు క్లెయిమ్ సెటిల్మెంట్స్ గురించి డీఎస్పీకి వివరించారు. ఎల్ఐసీ అన్ని విధాలుగా ముందంజలో ఉండడాన్ని డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి అభినందించారు. మేనేజర్ వెంట ఏబీఎం సుధాకర్‌రావు, డీఓ రాజు, ఎల్ఐసీ ఏజెంట్ల అధ్యక్షుడు సుభాష్ తదితరులు ఉన్నారు.



డీఎస్పీ రాంమోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న మేనేజర్ శ్రీనివాస్‌రాజు

## ధాన్యం తరలింపులో ప్రభుత్వం విఫలం

- ఎంపీపీ కల్లూరి హరికృష్ణ



మాట్లాడుతున్న ఎంపీపీ హరికృష్ణ

శివ్వంపేట(నర్సాపూర్): కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం సక్రమంగా తరలింపులో ప్రభుత్వం విఫలం అయిందని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. శుక్రవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చిన ధాన్యం 15 రోజుల అవుతున్నా.. తూకం వేయకుండా తరలించక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులకు ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. లారీల్లో తరలిస్తున్న ధాన్యం వెయిటింగ్ పేరిట బస్తాకు రూ.3 రూపాయల నుంచి రూ.5 రూపాయలు రైతులు నుంచి వసూలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ నాయకులు అశోక్‌రెడ్డి, కొండల్, గోవర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.